కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.23, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 45, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 23, క్యారెట్ 50, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 6–7, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



రాంగోపాల్‌పేట్: రోటరీ క్లబ్ ఆఫ్ జాగృతి హైదరాబాద్, జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పికెట్ గాంధీయన్ స్కూల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో బసవతారం క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు క్యాన్సర్ స్క్రీనింగ్, పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు, క్లవ్ ఆస్పత్రి వైద్యులు దంత పరీక్షలు చేశారు. అలాగే ఈఎన్‌టీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆఫ్ జాగృతి హైదరాబాద్ అధ్యక్షుడు గంటా శ్రీవర్ధన్, కార్యదర్శి తాతా శ్రీకాంత్, సభ్యులు సుకన్య, కమల, లక్ష్మి, సుజన, సుమ, భానుమూర్తి పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో సంపూర్ణ గీతాపారాయణం




సనత్‌నగర్: మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, విజయలక్ష్మి దేవాలయం సంయుక్తంగా మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో గీతా పారాయణ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. శ్రీవిజయలక్ష్మి దేవాలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచార్యస్వామి, గీతాచార్య, గీతాపారాయణ వైభవ శిరోమణి తాడూరి విశ్వేశ్వర్, దైవజ్ఞశర్మల సమక్షంలో భక్తులు సంపూర్ణ గీతాపారాయణం చేశారు. మోడల్‌కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వంజరి సంఘం సర్వసభ్య సమావేశం



లాలాపేట: తార్నాకలోని వంజరి భవన్‌లో ఆదివారం తెలంగాణ వంజరి సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం ద్వారా ఇంత కాలం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అకౌంట్స్, రానున్న రోజుల్లో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు సంఘ సభ్యులందరు తమ అభిప్రాయాలను, సూచనలు చేశారు. సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కాందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్ పాల్గొన్నారు.

జీఎల్‌ఏటీ ఉపాధ్యక్షుడిగా అభిషేక్ గౌడ్



నియామక పత్రం అందుకుంటున్న అభిషేక్ గౌడ్

లాలాపేట: గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(జీఎల్‌ఏటీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అభిషేక్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి అందజేశారు. పలువురు సీనియర్ లెక్చరర్లు అభిషేక్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. అడ్డగుట్టలోని లంబాడీ బస్తీలో కరుణాకర్(59) నివాసముంటున్నాడు. రోజు మహేంద్రాహిల్స్‌లోని రెసిడెన్షియల్ స్కూల్ వద్ద వాకింగ్ చేయడానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్లి అక్కడ వాకింగ్ చేసి వస్తుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వాకింగ్ పూర్తి చేసుకొని తిరిగి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా శాంతినికేతన్ కాలనీలో స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలకు విలువే లేదా..?

డేంజర్ జోన్‌గా 'ఆలుగడ్డబావి' సర్కిల్
- ప్రమాదాల బారిన పాదచారులు
- వంతెన లేక ఇక్కట్లు



ఇరువైపులా బస్‌స్టాప్‌లు... ప్రమాదాలకు నిలయంగా మారిన ఆలుగడ్డబావి ప్రధాన రహదారి

సికింద్రాబాద్: మెట్టుగూడ ఆలుగడ్డబావి సర్కిల్‌లో ఇటీవల మరో యువకుడి నిండు ప్రాణం బలైంది. రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న ఓ యువకుడిని వేగంగా వచ్చిన వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలైన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ తరహా ప్రమాదాలకు ఆలుగడ్డబావి కూడలి హేతువుగా మారింది. ఈ సంవత్సరం ఇక్కడ దాదాపు 10 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మెట్టుగూడ జంక్షన్‌ను మూసివేయడం, ఆలుగడ్డబావి ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేయడంతో పాదచారులకు, వాహనదారులకు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

- మెట్టుగూడ వాసులు లాలాగూడ, తార్నాక ప్రాంతాలకు వెళ్లడానికి ఆలుగడ్డబావి రహదారిని ఆశ్రయించాలి. బస్‌స్టాపులు కూడా ఈ కూడలికి ఇరు వైపులా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మెట్టుగూడ వాహనదారులే కాదు... ఎక్కువ సంఖ్యలోని పాదచారులు ఇక్కడ రోడ్డు దాటక తప్పని పరిస్థితి నెలకొంది.

వాహనాల రద్దీ అధికం...

తార్నాక నుంచి సికింద్రాబాద్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలన్నీ ఆలుగడ్డబావి కూడలిని దాటుకుని వెళ్లాల్సిందే. ఉదయం సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ అత్యధికంగా ఉంటుంది. అదే సమయంలో పాదచారులు వేగంగా వచ్చే వాహనాలను దాటుకుని వెళ్లే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

- తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో పలువురు వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నా సమస్యకు పరిష్కరించే నాధులే కరువయ్యారు. మెట్టుగూడ జంక్షన్ మూసివేత నేపథ్యంలో ఆలుగడ్డబావి ప్రాంతంలోనే 'యూ' టర్న్‌ను ఏర్పాటు చేశారు. మెట్టుగూడ ఆలుగడ్డబావి నుంచి వచ్చే వాహనాలు రోడ్డు దాటుకుని 'యూ' టర్న్ తీసుకుంటున్న సమయంలోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



జనంలేని చోట నిరుపయోగంగా ఉంటున్న రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఫుట్‌ఓవర్ వంతెన

నిరుపయోగంగా ఉక్కు వంతెన...

పాదచారుల ఇబ్బందులు తొలగించడానికి రద్దీ ప్రాంతాల్లో వంతెనలు నిర్మించడం ఆనవాయితీ. కానీ మెట్టుగూడలో రద్దీ అసలే ఉండని రైల్వే ఆఫీసర్స్ క్లబ్ వద్ద ఉక్కు వంతెనను ఏర్పాటు చేశారు. మెట్రో అధికారులు కనీసం ముందుచూపు లేకుండా పాదచారులు వినియోగించుకోని ప్రదేశంలో నిర్మించిన ఈ వంతెన ఎక్కేవారు దిగేవారు లేక తుప్పుపట్టి పోతోంది. వంతెన నిర్వహణబాధ్యతలు కూడా మెట్రో అధికారులు గాలికి వదిలేయడంతో క్రమేణా శిథిలావస్థకు చేరుతుంది.

ప్రతిపాదనలకే పరిమితం.....

- ఆలుగడ్డబావి కూడలిలో ఫుట్‌ఓవర్ వంతెన ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఏళ్లుగా కార్యరూపం దాల్చడం లేదు. రైల్వే ఆఫీసర్స్ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన ఉక్కు వంతెనను ఇక్కడికి బదలాయించాలన్న ప్రతిపాదన సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు. ఆ తరువాత ఇక్కడి ప్రమాదాల తీవ్రతను గుర్తించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుట్‌ఓవర్ వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- తార్నాక నాగార్జున స్వీట్‌హౌజ్ వద్ద ఏర్పాటు చేయాలనుకున్న ఫుట్‌ఓవర్ వంతెన ఏర్పాటును ఉపసంహరించుకుని అక్కడ ఏర్పాటు చేయాలనుకున్న వంతెనను ఆలుగడ్డబావి వద్ద నిర్మించాలనుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ వంతెన ఏర్పాటు ప్రతిపాదనకు కార్యరూపం ఇవ్వడం లేదు. వంతెన నిర్మాణం జరుగక ఐదేళ్లుగా ఇక్కడ జరుగుతున్న ప్రమాదాల బారిన పడుతున్న పలువురు పాదచారులు, వాహనదారుల నిండు ప్రాణాల బలవుతున్నాయి.

సనాతన ధర్మం ఎంతో గొప్పది

కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: సనాతన ధర్మం ఎంతో గొప్పదని.. పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. పద్మారావునగర్‌లోని స్కందగిరి దేవాలయంలో ప్రాంగణంలో జరుగుతున్న శ్రీ జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవ వేడుకలకు ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరై మాట్లాడారు. సనాతన ధర్మం దేశంలో వేల సంవత్సరాల నుంచి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డిని వేదపండితులను సత్కరించారు. శ్రీ స్కందగిరి సుబ్రమణ్యస్వామి దేవాలయం కృష్ణన్ రాజమణి, ట్రస్ట్ చైర్మెన్ తూములూరి సాయినాథ్ శర్మ పాల్గొన్నారు.

13 బీర్ బాటిళ్లు స్వాధీనం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పోలీసులు వెంకటగిరిలోని కేకే వైన్స్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో బత్తుల శివకుమార్ అనే వ్యక్తి పరిమితికి మించి 13 బీరు బాటిళ్లు తీసుకెళ్తుండగా పోలీసులు సీజ్ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఎన్నికలు జరుగుతున్న ప్రాంతంలో ఒక వ్యక్తి నిబంధనల ప్రకారం 10 బీరు బాటిళ్లు, లేదా నాలుగు విస్కీ బాటిళ్లు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇంట్లో కూడా నాలుగున్నర లీటర్లకు మించి విస్కీ బాటిళ్లు ఉండడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు

- ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సిబ్బంది
- ఇప్పటికే పూర్తయిన పోలీసుల తనిఖీలు



పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంప్‌లు నిర్మిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నవంబర్ 11వ తేదీన జరగనుండగా అక్టోబర్ 13వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఇటు నామినేషన్ కేంద్రంలోనూ, అటు పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు మెరుగుపరుస్తున్నారు. అన్ని పోలింగ్ బూత్‌లకు వృద్ధులు, దివ్యాంగులు తేలికగా వెళ్లేవిధంగా ర్యాంప్‌లు నిర్మిస్తున్నారు. ప్రతి పోలింగ్‌బూత్ లోనూ వెలుతురు స్పష్టంగా ఉండేలా లైట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు రోడ్లకు మరమ్మతులు చేయడం, స్ట్రీట్ లైట్లు ఏర్పాటుచేయడం జరుగుతుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 2,07, 367 కాగా, మహిళలు 1,91,590 ఉన్నారు. మొత్తం 139 లొకేషన్లలో 407 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. నియోజకవర్గ పరిధిలో ఆరున్నర డివిజన్లు కవర్ అవుతున్నాయి. ఇందులో అత్యధిక పోలింగ్ బూత్‌లు రహమత్‌నగర్ డివిజన్‌లో ఉండగా, అత్యల్పంగా సోమాజీగూడ డివిజన్‌లో ఉన్నాయి.

- నియోజకవర్గ పరిధిలోకి ఎనిమిది పోలీస్‌స్టేషన్లు వస్తుండగా అత్యధికంగా బోరబండలో 146 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. అతి తక్కువ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 16 బూత్‌లు ఉన్నాయి.
- జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, మధురానగర్, బోరబండ, టోలిచౌకి, గోల్కొండ, సనత్‌నగర్ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో 139 పోలింగ్ లొకేషన్లు ఉండగా, యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం నుంచి ఈవీఎంలు తీసుకువెళ్లడానికి, ఓటింగ్ జరిగిన తర్వాత ఈవీఎంలను తిరిగి స్ట్రాంగ్‌రూమ్‌లోకి చేర్చడానికి 13 రూట్లు ఏర్పాటు చేశారు.
- ఇందుకోసం భారీ పోలీసు బందోబస్తు శిక్షణ పొందిన సిబ్బందిని నియమిస్తున్నారు. ఇప్పటికే కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లు పటిష్టమైన బందోబస్తు మధ్య ఏర్పాటుచేశారు.

ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని బూత్‌లు...

పోలీస్ స్టేషన్	లొకేషన్	పోలింగ్ కేంద్రాలు
జూబ్లీహిల్స్	9	28
ఫిలింనగర్	6	16
పంజగుట్ట	8	23
మధురానగర్	43	119
బోరబండ	44	146
టోలిచౌకి	13	33
గోల్కొండ	7	17
సనత్‌నగర్	9	21

డివిజన్‌ల వారీగా పోలింగ్ కేంద్రాలు ఈ విధంగా ఉన్నాయి

వార్డు పేర్లు	పోలింగ్	బూత్‌లు
షేక్‌పేట	(94)	70
సోమాజీగూడ	(97)	34
యూసుఫ్‌గూడ	(96)	61
వెంగళరావునగర్	(99)	57
ఎర్రగడ్డ	(101)	61
రహమత్‌నగర్	(102)	72
బోరబండ	(103)	52

ఉత్సాహంగా ముదిరాజ్‌ల అలయ్‌బలయ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ ముదిరాజ్‌ల అలయ్‌బలయ్ కార్యక్రమం ఆదివారం సందడిగా జరిగింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, అధ్యక్షుడు అమ్మగారి యాదగిరి నేతృత్వంలో నామాలగుండు బీఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలువురు వక్తలు ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ప్రగతి సాధించడానికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముదిరాజుల బలం ప్రాతిపదికన రాజకీయ ప్రాధాన్యత లభించడం కోసం పార్టీల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సుక్క గణేష్, కనకట్ల హరి, మాజీ కార్పొరేటర్ సుజాత, మేకల కీర్తి హర్షకిరణ్, నాగేష్‌ముదిరాజ్, అశోక్, సురేష్, హన్మంతు, సతీష్‌ముదిరాజ్, లలిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వద్ద ఆందోళన



ఓయూలో నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నేతలు

లాలాపేట: బీసీల 42 శాతం రిజర్వేషన్‌పై కుట్రలు పన్నుతున్న అగ్రవర్ణాల విధానాలకు వ్యతిరేకంగా ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలో బీసీ ఐక్య విద్యార్థి సంఘాలు నిరసన తెలిపాయి. ఆర్ట్స్ కళాశాల వద్ద టీఎస్‌పి స్టేట్ ప్రెసిడెంట్ ఎన్ఎం శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పలు విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన బీసీల రిజర్వేషన్‌లను అడ్డుకోవాలనుకోవడం సిగ్గుచేటన్నారు. కోర్టులో కేసులు వేసి రిజర్వేషన్లను అడ్డుకునేవారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో బీసీఎస్‌ఎఫ్ అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు, తాళ్ల అజయ్ పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియకు మార్గదర్శకాల జారీ

- ఈ నెల 21 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు

బంజారాహిల్స్: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికకు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుండగా, ఆ వెంటనే నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన రాజకీయ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం సూచించారు.

నామినేషన్ దాఖలుకు మార్గదర్శకాలు...

అవసరమైన ఫారాలు:
ఫారం–2బీ (నామినేషన్), ఫారం–26 (అఫిడవిట్–అన్ని కాలమ్స్ తప్పనిసరి, నోట రైజ్ చేయాలి)

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..

నామినేషన్ దాఖలు కార్యాలయం: రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం , షేక్‌పేట మండలం

దాఖలు చేయగలవారు:
అభ్యర్థి లేదా ప్రతిపాదకుల్లో ఒకరు

ఫొటో పరిమాణం:
2 ఇన్‌టూ 2.5 సెంటీమీటర్లు

అభ్యర్థి కనీస వయస్సు:
25 సంవత్సరాలు

ప్రతిపాదకుల అవసరం:
- గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులు అయితే ఒక్క ప్రతిపాదకుడు (నియోజకవర్గ ఓటరు)
- స్వతంత్ర/గుర్తింపు లేని అభ్యర్థులు అయితే పది మంది ప్రతిపాదకులు (అందరూ నియోజకవర్గ ఓటర్లు)
- ఇతర నియోజకవర్గ అభ్యర్థులు అయితే సంబంధిత ఈఆర్‌ఓ నుంచి ఓటర్ల వివరాలు సమర్పించాలి.

ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా డిజిటల్ నామినేషన్..

- అభ్యర్థులు ఈఎన్‌సీఓఆర్ఈ.ఈసీఐ.జీఓవీ.ఇన్ ద్వారా నామినేషన్ ఫారం ఆన్‌లైన్‌లో నింపవచ్చు.
- క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింటెడ్ హార్డ్‌కాపీ తప్పనిసరిగా సమర్పించాలి.
- ఆన్‌లైన్ డిపాజిట్ బ్యాంక్/ట్రెజరీలో క్రెడిట్ అయి ఉండాలి. లేకపోతే మాన్యువల్ డిపాజిట్ చేయాలి.

నామినేషన్ సమయంలో పరిమితులు..

- ఆర్వో/ఏఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలు
- అభ్యర్థితో సహా ఐదుగురికి ప్రవేశ అనుమతి.
- ఒకే ద్వారం ద్వారా ప్రవేశం ఉంటుంది.

చెత్త వేస్తే జరిమానా.. జైలు తథ్యం



ఫిలింనగర్ చౌరస్తాలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బంజారాహిల్స్: చెత్త వేయవద్దని ఎన్నిమార్లు మొత్తుకున్న కొంత మందిలో మార్పు రాకపోవడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు వినూత్న తరహాలో ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతంనగర్ చౌరస్తాలో ఓ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. రోడ్డుపై చెత్త వేసిన వారికి రూ. 1000 జరిమానాతో పాటు ఒక వారం రోజులు జైలు శిక్ష పడేలా కేసులు పెడతామంటూ హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ చెత్త వేయడానికి స్థానికులు జంకుతున్నారు. ఫిలింనగర్‌లో బహిరంగంగా చెత్త వేసే రెండు చోట్ల ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని ఈ ప్రాంతాల్లో స్థానికులు చెత్త వేయడం లేదని అధికారులు తెలిపారు.

మద్యం తాగి.. వేగంగా డ్రైవ్ చేసి...

వెంగళరావునగర్: మద్యం సేవించి వేగంగా డ్రైవ్ చేసి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన గుర్తు తెలియని వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న అభిమిత్ర తన స్నేహితులతో కలిసి శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలపై సత్యసాయి నిగమాగమం వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మరో ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వచ్చిన వ్యక్తి అభిమిత్ర స్నేహితుల బైక్‌ను ఢీకొట్టింది. అనంతరం ఆగకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో స్నేహితుడు వంశీ, సోదరుడు అన్వేష్‌లకు గాయాలయ్యారు. వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అభిమిత్ర మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు

బన్సీలాల్ పేట్ : సికింద్రాబాద్ న్యూబోయిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 2005–06 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 20 ఏళ్ల క్రితం తమకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహమూర్తి, కృష్ణమూర్తి, విజయకుమార్, స్వరూప, మాధవి పాల్గొన్నారు.





తార్నాక బస్తీ దవాఖానాలో డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి



లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వర్షిణి



పోలియో చుక్కలు వేస్తున్న వెల్లాల రామ్మోహన్..



బొల్లారం లైబ్రరీలో..

పల్స్ పోలియో విజయవంతం

సనత్‌నగర్: దేశవ్యాప్తంగా పోలియో నిర్మూలనలో భాగంగా చేపట్టిన పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా కొనసాగింది. సనత్‌నగర్, సికింద్రాబాద్ నియోజకవర్గంలో అన్ని యూపీహెచ్‌సీ సెంటర్లతో పాటు పలు కమ్యూనిటీ హాళ్లు, నర్సింగ్ హోమ్‌లలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు.



మహ్మద్‌గూడ యుపీహెచ్‌సీ వద్ద..